
సాక్షి
ఖమ్మం
ఆదివారం । 22 । జూన్ । 2025



బడిలో సెల్‌కు చెల్లు..

ప్రభుత్వ పాఠశాలల తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ వాడొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. 8లో



లాకులకు లీకులు

కిన్నెరసాని రిజర్వాయర్ గేట్లకు ఏళ్ల తరబడి మరమ్మతులు లేక పలు చోట్ల లీకేజీలతో నీరు వృథాగా దిగువకు వెళ్తోంది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
36° / 27°

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి అభిషేకం, నిత్యకల్యాణం



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి మూల విరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి పంచామృతంతో అభిషేకం జరిపించారు. ఆతర్వాత స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన నిత్య కల్యాణం, పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ పాల్గొన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాలు, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండలాల పరిధిలో రోడ్ల విస్తరణ, బీటీ రోడ్ల నిర్మాణ పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేస్తారు. ఆతర్వాత నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో పర్యటనకు మంత్రి పొంగులేటి బయలుదేరతారు.

26న డాక్ అదాలత్

ఖమ్మంగాంధీచౌక్: తపాలా సేవలు, ఉద్యోగుల పనితీరుపై ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరించేందుకు ఈనెల 26వ తేదీన ఆన్‌లైన్ విధానంలో డాక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వీరభద్రస్వామి తెలిపారు. ఖమ్మం డివిజన్ పరిధిలోని తపాలా సేవలు, ఉద్యోగుల పనితీరుపై ఫిర్యాదులను ఈనెల 24వ తేదీలోగా 'డాక్ అదాలత్, సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, ఖమ్మం డివిజన్, ఖమ్మం–507003' చిరునామాకు పంపించాలని సూచించారు. ఫిర్యాదుతో పాటు మొబైల్ నంబర్ లేదా ఈ మెయిల్ జత చేస్తే, అదాలత్ సమయాన వారిని లింక్ చేసి సమస్యను చర్చిస్తామని తెలిపారు.

డిగ్రీ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కాలేజీలో ఖాళీ సీట్ల భర్తీకి ఈనెల 25న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సుల్లో సీట్లను రిజర్వేషన్ల ఆధారంగా భర్తీ చేయనుండగా 25న ఉదయం 11గంటలకు స్పాట్ కౌన్సెలింగ్ మొదలవుతుందని పేర్కొన్నారు. ఈమేరకు ఎస్సెస్సీ, ఇంటర్ మెమో, టీసీ, కుల, ఆదాయ, ఫిట్‌నెస్, స్థానికత ధ్రువపత్రాలతో పాటు పది పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని సూచించారు. వివరాలకు 99639 30931, 70326 32863 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

యూపీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: యూపీఎస్సీ సివిల్స్‌కు సిద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, బీసీ–ఈ, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు హైదరాబాద్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన శిక్షణ ఇవ్వనుండగా, నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని ప్రతులను 'డైరెక్టర్, టీజీఎస్సీ స్టడీ సర్కిల్, రోడ్డు నంబర్ 14, కేబీఆర్ పార్కు ఎదుట, బంజారాహిల్స్, హైదరాబాద్' చిరునామాలో వచ్చేనెల 7లోగా అందజేయాలని సూచించారు. వచ్చేనెల 13న ఇంగ్లిష్ మీడియంలో నిర్వహించే ప్రవేశపరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 040–23546552, 81216 26432, 90320 77276 నంబర్లలో సంప్రదించాలని డీడీ సూచించారు.

9ఎకరాల వరకు పెట్టుబడి సాయం జమ

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం ద్వారా శనివారం నాటికి తొమ్మిది ఎకరాల వరకు భూమి కలిగిన రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమ అయింది. జిల్లాలో 3,53,794 మంది రైతులను అర్హులుగా గుర్తించగా, రూ.436,84,65,365 అందాల్సి ఉంది. ఇందులో శనివారం నాటికి 3,20,105 మంది రైతుల ఖాతాల్లో రూ.347,18,42,096 జమ అయ్యాయని డీఏఓ పుల్లయ్య తెలిపారు.

యోగాతో శారీరక, మానసిక దృఢత్వం

ఎంపీ రఘురాంరెడ్డి, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



ఆసనాలు వేస్తున్న ఎంపీ రఘురాంరెడ్డి, నాయకులు



ధ్యానం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మేయర్ నీరజ, డీవైఎస్‌ఓ సునీల్‌రెడ్డి తదితరులు

నిత్యం యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వం అలవడుతుందని.. మానసిక ప్రశాంతత సొంతమవుతుందని ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఖమ్మంలోని పటేల్ స్టేడియంలో యువజన, క్రీడల శాఖ, ఆయుష్ విభాగం, ఖమ్మం యోగా ధ్యాన సమాఖ్య ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడగా మేయర్ పి.నీరజ, డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్, డీఎంహెచ్‌ఓ కళావతి, ఆయుష్ జిల్లా వైద్యాధికారి పద్మావతి, డాక్టర్ కనకమహాలక్ష్మి, రాంచందర్‌రావుతో పాటు వంజాకు లక్ష్మీనారాయణరావు, బాలరాజుశర్మ, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలాగే, లకారం ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన యోగా దినోత్సవంలో ఎంపీ రఘురాంరెడ్డి పాల్గొని ఆసనాలు వేశాక మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీలత, కొప్పుల చంద్రశేఖర్, చల్లా ప్రతిభారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇక రామన్నపేటలోని జిల్లా జైలులో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యాన ఖైదీలతో యోగా చేయించారు. జైలు సూరింటెండెంట్ శ్రీధర్, ఉద్యోగులు ఏ.సక్రు నాయక్, జి.లక్ష్మీనారాయణ, ఏ.సుభాష్, ఎం.వెంకటేశ్వర్లు, కె.హన్మంతరావు పాల్గొన్నారు. కాగా, మధిరలోని వైరా నదిలో స్విమ్మర్లు వేసిన జలయోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

– ఖమ్మంస్పోర్ట్స్/ఖమ్మం మయూరిసెంటర్/ఖమ్మం రూరల్/మధిర



మధిరలోని వైరా నదిలో యోగాసనాలు వేస్తున్న స్విమ్మర్లు

భూభారతీ.. భారం మీదే



బోనకల్ మండలం రావినూతలలో దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి (ఫైల్)

- దరఖాస్తుల ఆన్‌లైన్, పరిశీలనపై అధికారుల దృష్టి
- నేలకొండపల్లి, బోనకల్ మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహణ
- మిగతా 19మండలాల్లో 67,378 దరఖాస్తుల స్వీకరణ
- సాదాబైనామా కోసం అత్యధికంగా 40,872..

సాక్షిప్రతినిధి, ఖమ్మం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా ఈనెల 3నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు శుక్రవారం ముగిశాయి. అధికారులు బృందాలుగా విడిపోయి గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో సమస్యల పరిష్కారం కోసం రైతులు 67,378 దరఖాస్తులు అందజేశారు. తొలిదశలో పైలట్ ప్రాజెక్టుగా నేలకొండపల్లి, బోనకల్ మండలాల్లో కలిపి 6,085 దరఖాస్తులు వచ్చాయి. తద్వారా మొత్తం 73,463 దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ పరిష్కారం చూపాల్సి ఉంటుంది. అయితే, నేలకొండపల్లి, బోనకల్ మండలాల్లో అందిన దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం ఇప్పటికే కొనసాగుతోంది. మిగిలిన మండలాల్లో అందిన అర్జీలపై త్వరలోనే దృష్టి సారించనున్నారు. అయితే, మొత్తంగా అందిన దరఖాస్తుల్లో అత్యధికంగా సాదాబైనామాలపైనే ఉండడం విశేషం.

ఆ రెండు మండలాల్లో తొలుత..

భూభారతి చట్టాన్ని ఏప్రిల్ 14న ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఎంపిక చేసిన పైలట్ మండలాల్లో నేలకొండపల్లి కూడా ఉంది. దీంతో ఈ మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించగా 3,224 మంది రైతులు దరఖాస్తులు ఇచ్చారు. రెండో విడతలో బోనకల్ మండలాన్ని ఎంపిక చేయగా ఇక్కడ 2,861 దరఖాస్తులు వచ్చాయి. రెండు మండలాల్లో సాదాబైనామాపైనే దరఖాస్తులు ఎక్కువగా అందాయి. వీటిని పక్కన పెట్టి మిగతా దరఖాస్తులకు సంబంధించి నేలకొండపల్లి మండలంలో 354 పరిష్కరించగా, బోనకల్ మండలంలోనూ క్షేత్రస్థాయిలో పరిశీలన కొనసాగుతోంది.

తుది నిర్ణయం వచ్చాకే..

రైతులు వివిధ సమస్యలపై దరఖాస్తులు ఇవ్వగా అత్యధికంగా 40,872 దరఖాస్తులు సాదాబైనామాలపైనే రావడం గమనార్హం. ఇక సర్వేనంబర్లు తప్పుగా నమోదయ్యాయని 4,390, మ్యుటేషన్ కోసం 956 దరఖాస్తులు ఇచ్చారు. అలాగే, పాస్ పుస్తకాల్లో పట్టేదారు వివరాల నమోదుకు 187, ప్రొహిబిటెడ్ జాబితా నుంచి తొలగింపునకు 355 దరఖాస్తులు వచ్చాయి. అయితే, సాదా బైనామాలకు సంబంధించిన ప్రభుత్వం నుంచి నిర్ణయం వెలువడాల్సి ఉండడంతో అధికారులు వీటి పరిశీలన మొదలుపెట్టలేదు. దీంతో రైతులు ఇంకొన్నాళ్లు ఎదురుచూడక తప్పని పరిస్థితి నెలకొంది.

పరిశీలనకు కసరత్తు

జిల్లాలో నిర్వహించిన సదస్సుల్లో అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిశీలించాల్సి ఉంటుంది. పైలట్ ప్రాజెక్టుగా నేలకొండపల్లి, బోనకల్ మండలాల్లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ముగియగా పరిశీలన, పరిష్కారం ఊపందుకున్నాయి. మిగిలిన మండలాల్లోనూ అధికారులు సమస్యలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించాక పరిష్కారంపై దృష్టి సారించనున్నారు. ఓసారి నిర్ణయం వెలువరించాక భవిష్యత్‌లో మరోసారి వివాదం, ఘర్షణ జరగొద్దనే భావనతోనే పకడ్బందీగా పరిశీలన చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

జిల్లాలో అత్యధిక దరఖాస్తులు వచ్చిన మండలాలు

మండలం	దరఖాస్తులు
కారేపల్లి	6,114
కొణిజర్ల	5,539
ఏన్కూరు	4,994
కల్లూరు	4,866
పెనుబల్లి	4,653
తల్లాడ	4,567
కామేపల్లి	4,527
కూసుమంచి	3,877
వేంసూరు	3,830
రఘునాథపాలెం	3,534
వైరా	3,344
తిరుమలాయపాలెం	3,097
ఎర్రుపాలెం	3,040

19 మండలాలు..339 గ్రామాలు

జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన రెండు మండలాలు మినహా మిగిలిన 19 మండలాల్లో ఈనెల 3 నుంచి భూభారతి చట్టం అమలు ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఆయా గ్రామాల్లో శుక్రవారం వరకు కొనసాగాయి. అధికారుల బృందం 339 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు నిర్వహించి భూభారతి చట్టంతో ఉపయోగాలు, రైతుల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయో అవగాహన కల్పించారు. దీంతో ఏళ్లుగా సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు వెల్లువలా 67వేలకు పైగా దరఖాస్తులు సమర్పించగా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

వన మహోత్సవానికి సిద్ధం

- 571 నర్సరీల్లో 25లక్షల మొక్కలు రెడీ
- ఈసారి 3.50 లక్షల తాటి, ఈత మొక్కలు ప్రత్యేకం
- ప్రభుత్వ ఆదేశాలు రాగానే ప్రారంభం



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో ఈ ఏడాది వన మహోత్సవానికి సన్నాహాలు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ఆధ్వర్యాన నర్సరీల్లో మొక్కలు ఇప్పటికే సిద్ధం చేశారు. ఈసారి పర్యావరణ పరిరక్షణతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాల కోసం తాటి, ఈత మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించడం విశేషం. జిల్లాలోని 20మండలాల్లో 571 నర్సరీల్లో 25 లక్షల మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇందులో 3.50 లక్షల తాటి, ఈత మొక్కలు సిద్ధం చేశారు. ఇటీవల ఉమ్మడి జిల్లాల అధికారులతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ నిర్వహించిన సమీక్షలో తాటి, ఈత మొక్కల పెంపకంపై చేసిన సూచనలతో అధికారులు జిల్లాలో లక్ష్యం మేరకు నాటాలని నిర్ణయించారు.

పర్యావరణం.. జీవనోపాధి

గతంలో హరితహారం, వన మహోత్సవంలో నీడనిచ్చే మొక్కలతో పాటు పూలు, పండ్లు, మూలికల మొక్కలే నాటారు. ఈసారి తాటి, ఈత మొక్కలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఈ మొక్కలు నేల కోతను సమర్థవంతంగా అరికట్టి భూగర్భ జలాలను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వాతావరణ సమతుల్యత కాపాడడమే కాక కార్బన్ డై ఆక్సైడ్‌ను తగ్గించడానికి ఇవి తోడ్పడతాయి. తాటి, ఈత చెట్లు దీర్ఘకాలం జీవిస్తూ పర్యావరణ పరిరక్షణకే కాక ఉపాధికి ఊతమిస్తాయి. వీటి నుంచి లభించే కల్లు, తాటి బెల్లం, ఈత పళ్లు గ్రామీణ ప్రాంతాల్లో పలువురికి జీవనోపాధిని కల్పిస్తాయి.

ప్రణాళికాయుతంగా నిర్వహణ

వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు కలెక్టర్ ఆదేశాలతో డీఆర్‌డీఏ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటేలా అనువైన ప్రాంతాలను గుర్తిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ప్రాంగణాలు, గ్రామీణ రోడ్ల పక్కన ఖాళీ స్థలాలే కాక సామూహిక భూములను ఎంపిక చేస్తున్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించేలా అవసరమైన ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తున్నారు. నాటిన మొక్కలకు జియోట్యాగింగ్ చేయడం, క్రమం తప్పకుండా పర్యవేక్షించడం ద్వారా ప్రతీ మొక్కను బతికించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

హరిత స్ఫూర్తితో ముందుకు..

వన మహోత్సవాన్ని ప్రభుత్వ కార్యక్రమంగానే కాక జిల్లా వాసుల భాగస్వామ్యంతో ప్రజా ఉద్యమంగా మార్చాలని అధికారులు నిర్ణయించారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా కనీసం ఒక మొక్క అయినా నాటి సంరక్షించాలని కోరుతున్నారు. విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, మహిళా సంఘాల బాధ్యులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసేలా కార్యాచరణ రూపొందించారు. పచ్చదనం పెంచడం వ్యక్తిగత కృషి మాత్రమే కాక సామాజిక బాధ్యత కూడా అని అవగాహన కల్పించనున్నారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు.

ఈ – టికెట్లపై భక్తులకు అవగాహన

భక్తుల సమయాన్ని ఆదా చేసేందుకు దర్శనం, ప్రసాదాలు ఇతర సేవలకు గాను రామాలయంలో ఏర్పాటు చేసిన మిషన్లపై ఈఓ ఎల్.రమాదేవి శనివారం భక్తులకు అవగాహన కల్పించారు. తొలుత ఈ మిషన్లకు పూజలు నిర్వహించాక యంత్రాల్లో ఉన్న సదుపాయాలు, ఈ టికెట్లు పొందే విధానం గురించి వివరించారు. భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భక్తులు సైతం ఈ టికెట్లు తీసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రవీందర్, ఏఈఓ భవాని రామకృష్ణ, అర్చకులు పాల్గొన్నారు.

సాహిత్యంలో ధిక్కార స్వరాలు

- రచనలతో చైతన్యపరిచిన దాశరథి, ఆరుద్ర
- జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో ఘంటా చక్రపాణి



మాట్లాడుతున్న వీసీ చక్రపాణి, వేదికపై అల్లం నారాయణ, కె.శ్రీనివాస్, గౌరీశంకర్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: సామాజిక పరిణామాలపైనే కాక స్వాతంత్ర్యానంతరం దేశంలోని మార్పులపై తమ సాహిత్యం, రచనల ద్వారా దాశరథి, ఆరుద్ర ధిక్కార స్వరం వినిపించారని డాక్టర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి అన్నారు. అంతేకాక తమదైన రచనా శైలితో ప్రజలను చైతన్యపరిచారని తెలిపారు. ఖమ్మంలోని ఎస్ ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యాన 'శతజయంతి సాహితీమూర్తులు – దాశరథి, ఆరుద్ర జీవితం – సాహిత్యం'పై రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాకీరుల్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో చక్రపాణి మాట్లాడుతూ దాశరథి తెలంగాణ జీవన స్వరమన్నారు. ఖమ్మంతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉందని, ఆయన పాదముద్రలు పడిన ఖమ్మంలో శతజయంతి సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆయన సాహిత్యం, పాటలు ఉత్తేజం, స్ఫూర్తిని కలిగించాయన్నారు. ఇక ఆరుద్ర గొప్ప పరిశోధకుడిగా, కవిత్వంలో ప్రయోగాలకు ఆధునికుడిలా నిలిచారని తెలిపారు. సీనియర్ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతీయ అస్తిత్వ చైతన్యం, నిజాం నిరంకుశ పాలన కాలపు బడుగుల కన్నీళ్లను అక్షరబద్ధం చేశారన్నారు. స్వీయ అనుభవాలు, సామాజిక పరిణామాలు దాశరథి ప్రతీ రచనలో కనిపిస్తాయని తెలిపారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ పూర్వ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ ఖమ్మం సాహిత్య గుమ్మం అని, ఇక్కడ నిర్వహించిన జాతీయ సదస్సు చరిత్ర పుటల్లో నిలుస్తుందని చెప్పారు. అనంతరం బీసీ కమిషన్ పూర్వ సభ్యుడు జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ ఈ తరం విద్యార్థులు దాశరథి, ఆరుద్రల సాహిత్య సారాంశాన్ని తప్పక అధ్యయనం చేయాలని సూచించారు. సాహిత్య విశ్లేషకులు ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ దాశరథి తెలంగాణకు సాహిత్య దీపదారిగా నిలవడమేకాక తన రచనలతో సమాజాన్ని మేల్కొలిపారని వెల్లడించారు. స్వామి రామానందతీర్థ రూరల్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ఎన్.కిషోర్‌రెడ్డి, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ భూక్యా భాంగ్యా, సదస్సు కన్వీనర్ డాక్టర్ పి.రవికుమార్ మాట్లాడగా డాక్టర్ సీతారాం, రవిమారుత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికచట్టాల రక్షణకు పోరాటం

- జూలై 9న జాతీయ సార్వత్రిక సమ్మెకు సిద్ధం కావాలి
- ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య



ఎస్‌డబ్ల్యూఎఫ్ మహాసభల్లో మాట్లాడుతున్న లక్ష్మయ్య

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా రవాణా రంగంతో పాటు కార్మిక చట్టాలను కాపాడుకునేలా ప్రజా ఉద్యమాలకు రూపకల్పన జరగాలని అఖిల భారత రోడ్డు రవాణా కార్మికుల సమాఖ్య(ఏఐఆర్‌డబ్ల్యూఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య అన్నారు. ఇందుకు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) మహాసభలు వేదికగా నిలవాలని సూచించారు. ఖమ్మంలో శనివారం ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాలుగో మహాసభలు మొదలుకాగా, రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయులు జెండా ఆవిష్కరించాక అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూనే సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేయాలని సూచించారు. వచ్చేనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మికవర్గం పాల్గొని నిరసన తెలపాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు అశ్వద్ధామరెడ్డి, పాటి అప్పారావు, థామస్‌రెడ్డి, బత్తినేని హనుమంతరావు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెలో పాల్గొని జయప్రదం చేస్తామని ప్రకటించారు. ఈసమావేశంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీ.ఎస్.రావుతో పాటు కళ్యాణం వెంకటేశ్వరరావు, పి.శ్రీకాంత్, సీహెచ్.సుందరయ్య, ఎంఎస్.రెడ్డి, రాములు, ఎంవీఎస్ఎస్.నారాయణ, గుండు మాధవరావు, గడ్డం లింగమూర్తి, అల్లంశెట్టి వెంకటేశ్వర్లు, పద్మావతి, పి.రవీందర్‌రెడ్డి, బిక్షపతిగౌడ్, బత్తుల సుధాకర్, పిట్టల సుధాకర్, విక్రం, జిల్లా ఉపేందర్, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అటవీ కార్యాలయంలో రక్తదాన శిబిరం


శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ, డీఎంహెచ్‌ఓ

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని జిల్లా అటవీ కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా బాధితుల కోసం డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రంసింగ్ ఆధ్వర్యాన ఈ శిబిరం ఏర్పాటుచేయగా డీఎంహెచ్‌ఓ బి.కళావతిబాయి మాట్లాడారు. ఆరోగ్యంగా ఉన్న 18–65 ఏళ్ల మధ్య వయస్సు వారంతా రక్తదానం చేయొచ్చని, తద్వారా తలసేమియా బాధితులతో పాటు ఆపదలో ఉన్నవారిని ఆదుకున్నట్లవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఎఫ్‌ఓ హరిప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ చందూ నాయక్, డాక్టర్ నారాయణమూర్తి, సంకల్ప స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ప్రొద్దుటూరి అనిత, రవిచందర్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 15వరకు ఇన్‌స్పైర్ దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: ప్రస్తుత విద్యాసంవత్సరానికి గాను మేనేజ్‌మెంట్ ఆఫ్ ఇన్‌స్పైర్ అవార్డు స్కీమ్(ఈ–ఎంఐఏఎస్) సిస్టమ్ ద్వారా ఆన్‌లైన్ నామినేషన్లు సెప్టెంబర్ 15వ తేదీ వరకు స్వీకరిస్తామని డీఈఓ సామినేని సత్యనారాయణ తెలిపారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో మేధస్సు పదును పెట్టడానికి, వారిలో వినూత్న ఆలోచనల ద్వారా నూతన ఆవిష్కరణలు వెలికితీయడంతో పాటు సమాజంలో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి ఇన్‌స్పైర్ మానక్ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈమేరకు కు www. inspireawards-dst. gov.in ద్వారా 6నుంచి 12 తరగతుల విద్యార్థులతో ఉత్తమ ఆలోచనలను దరఖాస్తు చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి(94403 54528)ని సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

రూ.1.62కోట్లు కొల్లగొట్టిన కేసులో ఇంకొకరి అరెస్టు

ఖమ్మం క్రైం: ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించి సుమారు రూ.1.62 కోట్ల మేర మోసం చేసిన కేసులో మరో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. బోనకల్ మండలానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు ఫోన్ చేసిన ముఠా సభ్యులు దితులు అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి వాట్సప్, ట్రేడింగ్ లింక్‌ల ద్వారా సుమారు రూ.1.62 కోట్లు జమ చేయించారు. ఆతర్వాత ముఖం చాటేయడంతో మోసపోయిన గుర్తించిన బాధితుడు ఖమ్మం సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. దీంతో డబ్బు జమ అయిన అకౌంట్ ఆధారంగా ఇప్పటికే నలుగురిని అరెస్ట్ చేయగా, నేనావత్ అఖిల్‌ను నాగర్‌కర్నూల్ జిల్లాలో అరెస్టు చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరుపర్చాక రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన సైబర్ క్రైం డీఎస్పీ ఫణీందర్, ఎస్సైలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, సిబ్బందిని సీపీ అభినందించారు.

విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

పాల్వంచరూరల్: విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పోస్ట్‌మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో సోమవారం నాటికి వందశాతం హాజరు ఉండాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. పాల్వంచలోని గిరిజన బాలికల పోస్టు మెట్రిక్ వసతి గృహం, బాలుర ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలకు చేరుకునేలా హెచ్‌ఎంలు, వార్డెన్‌లు చర్యలు తీసుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పిల్లలకు రక్షిత తాగునీరు అందించాలని చెప్పారు. నూతన మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. అలాగే, విద్యార్థుల ఆరోగ్యం విషయంలో వార్డెన్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పీఓ ఈ సందర్భంగా సూచించారు.

బడిలో సెల్‌కు చెల్లు

- తరగతి గదుల్లో ఉపాధ్యాయులు ఫోన్ మాట్లాడొద్దు
- స్పష్టమైన ఆదేశాలు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం
- పిల్లల చదువుపై ప్రభావం పడుతుందని నిర్ణయం



వైరా: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇకపై తరగతి గదిలో సెల్‌ఫోన్ మాట్లాడడం నిషేధం. ఈ విషయమై రాష్ట్రప్రభుత్వం కొద్దిరోజుల క్రితం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. తరగతి గదిలో ఉన్న సమయాన సెల్‌ఫోన్‌లో మాట్లాడితే చర్యలు ఉంటాయని అందులో వెల్లడించింది. రాష్ట్రంలో చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారనే సమాచారంతో ఈ నిర్ణయం తీసుకుంది. ఉపాధ్యాయులు తరగతి గదుల్లో ఫోన్లు మాట్లాడడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా పిల్లల చదువుపై ప్రభావం పడుతుందని నిపుణుల సూచనలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు ఉపాధ్యాయులు స్వీయ నియంత్రణ పాటిస్తూ సెల్‌ఫోన్ వినియోగాన్ని పరిమితం చేసుకోవాలని సూచించింది.

సమయం వృథా కాకుండా..

తరగతి గదుల్లో ఉపాధ్యాయులు సెల్‌ఫోన్ మాట్లాడడం ద్వారా సమయం వృథా అవుతుందని, విద్యార్థుల్లో ఏకాగ్రత దెబ్బతింటుందని చెబుతున్నారు. అంతేకాక ఫోన్‌లో మాట్లాడగానే అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు వెంటనే పాఠ్యాంశంలో నిమగ్నం కావడం సాధ్యం కాదనే భావన వ్యక్తమవుతోంది. ఈ విషయమై విద్యావేత్తల నుంచి అందిన సమాచారంతో ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు తెలుస్తోంది. కాగా, ఉపాధ్యాయులు తరగతి గదిలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. రాగానే స్టాఫ్‌రూమ్‌లో పెట్టడం.. విరామ సమయాల్లోనూ చూసేలా పర్యవేక్షించాల్సి ఉంటుంది.

కఠిన చర్యలు తీసుకుంటాం..



ఉపాధ్యాయులు తరగతి గదుల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లొద్దు. పాఠం మధ్యలో ఫోన్ మాట్లాడినట్లు తేలితే చర్యలు తప్పవు. స్కూల్‌కు ఫోన్ తీసుకొచ్చినా హెచ్‌ఎంకు అప్పగించాలి. మధ్యలో వినియోగిస్తే బోధనలో ఏకాగ్రత దెబ్బతింటుంది.

– సామినేని సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి

ప్రభుత్వ నిర్ణయం మంచిదే..



ప్రభుత్వ ఉపాధ్యాయులు పనివేళల్లో సెల్‌ఫోన్ వాడకుండా తీసుకున్న నిర్ణయం మంచిదే. తద్వారా విద్యార్థులు, బోధనకు పూర్తి సమయాన్ని కేటాయించొచ్చు. విద్యార్థులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవడం హర్షణీయం. – దొడ్డా వరప్రసాద్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

కార్మికుల రేట్లపై చర్చలు వాయిదా


సమావేశంలో పాల్గొన్న మార్కెట్ చైర్మన్, అధికారులు, సంఘాల ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్మికుల రేట్లు సవరించేందుకు శనివారం పాలకవర్గం, అధికారులు, సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశం తుది నిర్ణయం తీసుకోకుండా వాయిదా పడింది. మార్కెట్‌లో పనిచేసే హమాలీలు, రెల్లుడు కూలీలు, స్వీపర్లు, దడవాయిలు తదితరులకు రెండేళ్లకోసారి కూలీ రేట్లు పెంచడం ఆనవాయితీ. ఈమేరకు కార్మిక సంఘాల ప్రతినిధులు 25 శాతం పెంచాలని కొన్నాళ్ల క్రితం లేఖ ఇచ్చారు. ఈ అంశంపై చర్చించేందుకు శనివారం మార్కెట్ చైర్మన్ యరగర్ల హన్మంతరావు అధ్యక్షతన కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో పాటు దిగుమతి శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈమేరకు కార్మిక సంఘాల ప్రతినిధులు పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా తమకు కూలీ ధరలు పెంచాలని కోరగా, రైతు సంఘాల ప్రతినిధులు మాత్రం ఈ ఏడాది పంటల ధరలు ఆశాజనకంగా లేనందున మరికొంత కాలం వాయిదా వేయాలన్నారు. దీంతో వారం తర్వాత మరోసారి సమావేశం నిర్వహించి తగిన నిర్ణయం తీసుకోవాలనే భావనకు రావడంతో రేట్ల పెంపు వాయిదా పడింది. మార్కెట్ ఉపాధ్యక్షులు తల్లాడ రమేష్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలంతో పాటు దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావు, దొండపాటి రమేష్, వేణు, మీరా, లక్ష్మీనారాయణ, మేకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు, పుస్తకాల అమ్మకంపై ఏఐఎస్‌ఎఫ్ ఆందోళన



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: అధిక ఫీజు వసూళ్లు, అక్రమంగా పుస్తకాల అమ్మకంపై ప్రశ్నించినందుకు నారాయణ విద్యాసంస్థల బాధ్యులు తమపై దాడి చేశారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ఆరోపించారు. ఖమ్మం జమ్మిబండ రోడ్డులోని నారాయణ విద్యాసంస్థల్లో అధిక ఫీజు వసూలు చేస్తున్నారని, స్టేషనరీ పేరుతో పుస్తకాలు అమ్ముతున్నారంటూ శనివారం ఆందోళనకు చేశామని పేర్కొన్నారు. ఈమేరకు ప్రిన్సిపాల్, సిబ్బంది దూషిస్తూ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆపై ఖమ్మం వన్ టౌన్ పోలీసులు చేరుకుని తమ నాయకులను అదుపులోకి తీసుకున్నారన్నారు. నారాయణ విద్యాసంస్థల్లోని గోదాంను విద్యాశాఖ అధికారులు సీజ్ చేసినా దొడ్డిదారిలో పుస్తకాలు అమ్ముతుండడాన్ని ప్రశ్నించినందుకే దాడి చేశారని ఆరోపించారు. కాగా, నారాయణ పాఠశాలలో ప్రైమరీ సెక్షన్‌కు అనుమతి లేకున్నా, చట్టాలను ఉల్లంఘిస్తున్నా విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, నాయకులు లోకేష్, షేక్ నాగుల్‌మీరా, మధు, కౌశిక్, మనోజ్, వినయ్, గౌతమ్, అఖిల్, నాగరాజు, నరేష్, ప్రతాపు, గోపి, రాజేష్ పాల్గొన్నారు.

ప్రాణదాతగా మాధాపురం వాసి

బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాల దానం


లక్ష్మీనారాయణ (ఫైల్)

ముదిగొండ: మండలంలో మాధాపురానికి చెందిన భువనగిరి లక్ష్మీనారాయణ(44) ఈనెల 16న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స చేయించే క్రమాన బ్రెయిన్‌డెడ్ అయిందని వైద్యులు నిర్ధారించారు. ఈమేరకు కుటుంబీకులు అవయవదానానికి అంగీకరించడంతో మరో ఎనిమిది మందికి ప్రాణదానం చేసినట్లయింది. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 16న లక్ష్మీనారాయణ టెట్ హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు ఆటోలో మాదాపురం నుంచి ఖమ్మం వెళ్తుండగా రహదారి పక్కన ఉన్న చెట్టు ఆటోపై పడింది. దీంతో లక్ష్మీనారాయణ తలకు గాయాలు కాగా ఖమ్మంలో చికిత్స చేయించినా ఫలితం లేకపోగా వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. ఈమేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ శనివారం ఉదయం ఆయన గుండె, నేత్రాలు, ఊపిరితిత్తులు, కిడ్నీలను సేకరించిన వైద్యులు అవసరమైన వారికి అమర్చారు. దీంతో లక్ష్మీనారాయణ మరో ఎనిమిది మందికి ప్రాణదానం చేసినట్లయింది. ఈమేరకు ఆయన మృతదేహం వద్ద గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు నివాళుర్పించి, అవయవదానానికి అంగీకరించిన కుటుంబీకులను అభినందించారు.

జిల్లాలో పలుచోట్ల వాన

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో శనివారం సాయంత్రం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. మధ్యాహ్నం వరకు గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రత నమోదు కాగా, సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమైంది. కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురవగా, రాత్రి 9 గంటల తర్వాత జిల్లాలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన సాధారణ వర్షం కురిసింది. రాత్రి 10 గంటలకు విడుదల చేసిన నివేదిక ఆధారంగా ఖమ్మం కలెక్టరేట్ వద్ద అత్యధికంగా 37.3 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అలాగే, కొణిజర్లలో 33.5, ఖమ్మం ఎన్నెస్పీ గెస్ట్‌హౌస్ వద్ద 19.5, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 16.8, కుర్నవల్లి 14.8, గౌరారంలో 12.5, గంగారం 10.0, వైరా 9, తిమ్మరావుపేట 8.3 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, ఇంకొన్ని ప్రాంతాల్లోనూ ఓ మోస్తరు వర్షం కురిసింది. కాగా, మే మూడో వారంలో ఓ మోస్తరుగా కురిసిన వానలు ఆ తర్వాత మొఖం చాటేశాయి. దీంతో పంటల సాగు ఆరంభించిన రైతులు ఎదురుచూస్తున్నారు. ఇంతలోనే శనివారం వర్షం మొదలుకాగా, తర్వాత వానల పరిస్థితి ఎలా ఉంటుందో వేచి చూడాల్సి ఉంది.

ఎదురెదురుగా బస్సు, ఆటో ఢీ

ఇద్దరు మహిళల మృతి, మరో ఇద్దరి పరిస్థితి విషమం


ఘటనాస్థలంలో క్షతగాత్రులు

కామేపల్లి: కామేపల్లి మండలం ముచ్చర్ల క్రాస్ సమీపాన శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... మహబూబాబాద్ జిల్లా గార్ల నుంచి లింగాల మీదుగా ఖమ్మం వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఖమ్మం నుంచి నలుగురు ప్రయాణికులతో ఇల్లెందు వైపు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో డ్రైవర్ సలీంతో ఆటోలో ప్రయాణిస్తున్న షేక్ మహబూబ్, హలీమా, సోందుబీ, జర్పుల కమలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఎస్సై సాయికుమార్, సిబ్బందితో చేరుకుని క్షతగాత్రులను 108లో ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే కొణిజర్ల మండలం గుబ్బగుర్తికి చెందిన షేక్ సోందుబీ(68) మృతి చెందింది. అలాగే చికిత్స చేయిస్తుండగా గాదెపాడుకు చెందిన అంగన్‌వాడీ టీచర్ షేక్ మహబూబ్(48) కన్నుమూసింది. అంతేకాక అలాగే, సలీం(ఇల్లెందు) పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా, కమల(గాదెపాడు)కు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు.

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్: కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని కాకర్లపల్లికి చెందిన మట్టా మురళీకృష్ణ(45) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నాక ఫలితం లేక శుక్రవారం రాత్రి ఆయన పురుగుల మందు తాగగా ప్రభుత్వాస్పత్రి తరలించారు. అక్కడే చికిత్సపొందుతూ మృతిచెందాడు. మురళీకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కేజీ గంజాయి స్వాధీనం

తిరుమలాయపాలెం: ఒడిశా నుంచి గంజాయి తీసుకొస్తున్న ఓ వ్యక్తిని శనివారం తిరుమలాయపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం గ్యామాతండాకు చెందిన ఆటో డ్రైవర్ లూనావత్ ప్రవీణ్‌కుమార్ అలియాస్ తాజ్ ఒడిశా నుండి మోటార్ సైకిల్‌పై కేజీ గంజాయితో వెళ్తున్నాడు. ఈక్రమాన తిరుమలాయపాలెం సమీపాన కొక్కిరేణి స్టేజీ వద్ద ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ ఆధ్వర్యాన వాహనాల తనిఖీ చేస్తుండగా తాజ్ అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో ఆయన వద్ద పరిశీలించగా కేజీకి పైగా ఎండు గంజాయి లభించింది. ఈమేరకు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

మానసిక వైద్యుల సదస్సులో మాజీ మంత్రి పువ్వాడ


సదస్సును ప్రారంభిస్తున్న పువ్వాడ, వైద్యులు

ఖమ్మంఅర్బన్: వృద్ధుల మానసిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, తద్వారా వారిని కాపాడుకోవచ్చని మాజీ మంత్రి, మమత విద్యాసంస్థల చైర్మన్ పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఖమ్మంలోని మమత ఆస్పత్రిలో 'వృద్ధుల మానసిక ఆరోగ్యం' అంశంపై ఏర్పాటుచేసిన రాష్ట్ర మానసిక వైద్యుల సదస్సును శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశంలో వేగంగా పెరుగుతున్న వృద్ధుల జనాభాకు అనుగుణంగా వారిలో ఒంటరితనం, మతిమరుపు సమస్యలపై చర్చించాల్సిన అవసరముందని తెలిపారు. పరిశోధకులు, వైద్యులు, వైద్యవిద్యార్థులు ఈ అంశంపై దృష్టి సారించాలన్నారు. ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ తెలంగాణశాఖ అధ్యక్షుడు డాక్టర్ అశోక్, మమతా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ నరేన్‌రాజ్, ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ దక్షిణ మండల శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఉమాశంకర్‌తో పాటు డాక్టర్ ప్రసాద్‌రావు, డాక్టర్ జార్జ్‌రెడ్డి, డాక్టర్ సతీష్‌బాబు, డాక్టర్ నారా యణరావు, డాక్టర్ అకుల విశాల్, డాక్టర్ రాయిరాల అనిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలి

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా నుంచి జాతీయ, అంతర్జాతీ య స్థాయికి ఎదిగిన క్రీడాకారులను వర్ధమాన క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకుని సత్తా చాటాలని ఖమ్మం మేయర్ పి.నీరజ సూచించారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో శారీ రక దృఢత్వంతో పాటు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్నాటి వీరభద్రం మాట్లాడగా కార్పొరేటర్ కమర్తపు మురళి, అసోసియేషన్ బాధ్యులు దుద్దుకూరి సత్యనారాయణ, వి. చంద్రశేఖర్, సిరిపురపు సుదర్శన్‌రావు, పాటిబండ్ల యుగంధర్, నల్లమోతు రఘు పాల్గొన్నారు.

విజేతలు వీరే..


జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతల వివరా లను నిర్వాహకులు ప్రకటించా రు. బాలుర అండర్–13 సింగిల్స్‌లో బి.రేవంత్‌కుమార్, వి.అశ్వినిరాజ్, డబుల్స్‌లో బి.రేవంత్‌కుమార్ – అశ్వినిరాజ్, శివర్ధన్ – సాహిత్, బాలికల అండర్–13 సింగిల్స్‌లో ఎం.చరితశ్రీ, జి.నిత్యసంతోషిని, డబుల్స్‌లో జి. నిత్య – ఎం.చరితశ్రీ, టి.నవియా, ఓంశ్రీల వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. అలాగే, అండర్–15 బాలుర సింగిల్స్‌లో వి.మేఘవర్షిత్, ఎస్.స్వప్నిల్, డబుల్స్‌లో కె.విశ్వతేజ – స్వప్నిల్, కె.నిశాంత్‌సాయి– బి.అభినవ్, అండర్–17 బాలుర సింగిల్స్‌లో ఏ.వినయ్, తేజస్ వివేక్, డబుల్స్‌లో ఏ.వినయ్ – డి.తేజస్ వివేక్, విశ్వతేజ్ – ఎస్.నిఖిల్, బాలికల సింగిల్స్‌లో హర్షిత, బి.ధరణి, బాలికల అండర్–15 సింగిల్స్‌లో వై.హాషిత, జె.అన్విత, బాలుర అండర్–19 సింగిల్స్‌లో డి.తేజస్ వివేక్, ఏ.వినయ్, డబుల్స్‌లో యశ్వంత్ – ప్రద్యవిన్, ఎం.రాజీవ్ – ఎస్.నిఖిల్, బాలికల సింగిల్స్‌లో వి.వేదస్వి, హర్షిత మొదటి రెండు స్థానాలు దక్కించుకున్నారు.

సంస్కృత పండితుడికి సన్మానం

భద్రాచలంటౌన్: భద్రాచల దేవస్థానంలో సంస్కృత పండితుడిగా పనిచేస్తున్న ఎస్టీజీ శ్రీమన్నారాయణ ఆచార్యులును భద్రాద్రి దేవస్థానం, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చిత్రకూట మండపంలో శనివారం ఘనంగా సన్మానించారు. వేలాది మంది విద్యార్థులకు సంస్కృత భాషను బోధించిన ఆయన ఇటీవల ప్రాచ్య విద్య విభూషణం బిరుదు అందుకున్నారు. ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎల్. రమాదేవి, ఏఈఓలు శ్రవణ్ కుమార్, భవాని రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాకులకు లీకులు..

- పదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని గేట్లు
- నిధులున్నా టెండర్లకు ఆసక్తి చూపని కాంట్రాక్టర్లు
- కిన్నెరసాని ప్రాజెక్ట్‌కు పొంచి ఉన్న ముప్పు
- ప్రమాదమేమీ లేదని కొట్టిపారేస్తున్న జెన్‌కో అధికారులు


కిన్నెరసాని ప్రాజెక్ట్ నుంచి వృథాగా పోతున్న నీళ్లు

పాల్వంచరూరల్: పారిశ్రామిక నీటి అవసరాలు తీర్చడంతోపాటు తాగు, సాగునీరు అందించే కిన్నెరసాని ప్రాజెక్ట్‌కు ప్రమాదం పొంచిఉంది. పదేళ్లుగా ప్రాజెక్ట్ గేట్లు(లాకులు) మరమ్మతులకు నోచుకోవడంలేదు. దీంతో గేట్ల మధ్య లీకులు ఏర్పడి జలాశయం నుంచి నీరు వృథాగా పోతోంది. రెండు, మూడేళ్లుగా గేట్ల రబ్బర్ సీల్స్ లీకై నీళ్లు బయటకు వస్తున్నాయి. లీకేజీ చిన్న సమస్యగా భావించి నిర్లక్ష్యం వహిస్తే పెద్ద ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు, పరీవాహక ప్రాంతాల ప్రజ లు పేర్కొంటున్నారు. గేట్లకు సంబంధించిన పిల్లర్లు కూడా దెబ్బతింటున్నాయి. మరమ్మతులకు అవసరమైన నిధులున్నా పనులు చేపట్టడం లేదు. ప్రా జెక్ట్ నిర్వహణ చూస్తున్న జెన్‌కో (కేటీపీఎస్) అధి కారులు మేల్కొనకపోతే పరిస్థితి తారుమారయ్యే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

రిజర్వాయర్ సామర్థ్యం 407 అడుగులు

కిన్నెరసాని రిజర్వాయర్ నిర్మాణం 1962లో ప్రారంభించి 1972లో పూర్తిచేశారు. 13క్రస్ట్‌గేట్లతో 407 అడుగుల గరిష్ట నీటిమట్టంతో 8.4 టీఎంసీల నిల్వసామర్థ్యంతో జలాశయం నిర్మించారు. తొలుత ప్రాజెక్ట్‌ను ఇరిగేషన్ శాఖ పర్యవేక్షించగా, 1998 ఏప్రిల్ 1 నుంచి జెన్ కో పర్యవేక్షిస్తోంది. ప్రాజెక్ట్ నిర్మించి ఆరు దశాబ్దాలు గడుస్తుండగా మధ్యలో జెన్‌కో అధికారులు కరకట్టను పటిష్టపరిచే పనులు చేపట్టారు. 2014లో రూ.60 లక్షలతో 13 క్రస్ట్ గేట్లకు రోప్ వే, సాకెట్లను మార్చారు. దీంతో వీటిని మరో పదేళ్లు మార్చాల్సిన అవసరం లేదు. కాగా కిన్నెరసాని జలాశయం విస్తీర్ణం 515 చదరపు మీటర్లు, డ్యామ్ ఎత్తు 39మీటర్లు, పొడవు 2.4 కిలోమీటర్లుగా ఉంది. కేటీపీఎస్‌లో విద్యుదుత్పత్తికి, ఎన్‌ఎండీసీ, నవభారత్, కర్మాగారాలకు కిన్నెరసాని నీరు సరఫరా చేస్తారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు తాగునీరు ఇక్కడి నుంచే వెళ్తుంది. పాల్వంచ మండలంలో మూడు వేలు, బూర్గంపాడు మండలంలో 7వేల ఎకరాల భూమికి సాగునీరు కూడా అందిస్తోంది.

మూడుసార్లు టెండర్లు పిలిచాం..



కిన్నెరసాని గేట్ల మరమ్మతుల కోసం రూ.1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గత నెల 6న, 22న, ఈ నెల 3న... మూ డు సార్లు టెండర్లు పిలిచాం. కానీ కాంట్రాక్టర్లు ఎవరూ ముందురావడంలేదు. డ్యామ్‌లో నీటిమట్టం 393 అడుగులు ఉంటేనే మరమ్మతులు చేసే అవకాశంఉంటుంది. గేట్ల మధ్య సీల్స్ ఏర్పాటు, రోప్ మార్పు, పెయింటింగ్ పనులు నిర్వహిస్తాం. డ్యామ్ సేఫ్టీ కోసం కూడా ప్రత్యేక నిధులు మంజూరయ్యాయి. – ప్రభాకర్‌రావు, కేటీపీఎస్ 5వ దశ సీఈ

పదేళ్ల క్రితం మరమ్మతులు

గేట్లకు పదేళ్లక్రితం మరమ్మతులు నిర్వహించారు. నా లుగైదు ఏళ్లకోసారి మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా జెన్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు. రిజర్వాయర్‌లోని నీటిమట్టం 393 అడుగుల లోపు ఉంటేనే మరమ్మతు పనులు చేపట్టేందుకు వీలవుతుంది. అంతకంటే ఎక్కువగా పెరిగితే పనులు సాధ్యం కావని అధికారులు చెబుతున్నారు. ప్రాజెక్ట్ ఒకటోగేటు నుంచి నాలుగో గేటు వరకు, 13వ నంబర్ గేట మధ్య పిల్లర్లకు బీటలు వారాయి. దీంతో పిల్లర్ల మధ్య నీటి చెమ్మ అధికంగా కన్పిస్తోంది. గేట్ల మధ్య రబ్బర్ సీల్స్ కూడా లీకవుతుండటంతో రిజర్వాయర్ నుంచి నీరు వృథాగాపోతోంది. అయితే ఈ లీకులతో ప్రమాదమేమీ లేదని కేటీపీఎస్ అధికారులు చెబుతున్నా రు. రిజర్వాయర్‌లోనీటిమట్టం 400అడుగులకు మిం చి పెరిగినప్పుడే బీటలనుంచి నీళ్లు బయటకు వస్తుందని పేర్కొంటున్నారు. పరీవాహక గ్రామాల ప్రజలు, ఆయకట్టు రైతులు మాత్రం ఆందోళన చెందుతున్నారు. ఆదిలోనే మరమ్మతులు నిర్వహించాలని, నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదం జరిగే అవకాశముందనిఆవేదన చెందుతున్నారు. కాగా పిల్లర్ల మరమ్మతులు, ఇతర పనులకు ఏడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వ పథకం డ్రిప్ ఇరిగేషన్ కింద రూ.2 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు.

కట్ట పటిష్టతకు రూ.1.90 కోట్లు

కిన్నెరసాని జలాశయం కరకట్ట పటిష్టతకు రూ.1.90కోట్లు, గేట్ల మరమ్మతులకు రూ.1.20 కోట్లను జెన్‌కో మంజూరు చేసింది. పుణేలోని సెంట్రల్ వాటర్ పవర్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీడబ్ల్యూపీఆర్‌ఎస్) నుంచి నిపుణులు వచ్చి అధ్యయనం చేయాల్సి ఉంది. ప్రాజెక్ట్‌ను పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాకే పనులు చేపడతామని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితులతోపాటు భవిష్యత్‌లో ఎదురయ్యే పరిణామాలను తట్టుకునేలా నిపుణులు అధ్యయనం చేసి సలహాలు ఇస్తారని పేర్కొన్నారు. ఇక గేట్ల మరమ్మతులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ఆసక్తి చూపకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది.